## క్లుప్తంగా

### రైతులను దోపిడీ చేస్తున్న ట్రేడర్లు: బీఆర్ఎస్ నేతలు



వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ చేస్తున్న ట్రేడర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ కార్యదర్శి ప్రభాకర్‌కు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కేంద్రాలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారులు, వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని వాపోయారు. ట్రేడర్లు కొనుగోళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ రెడ్డి, నాయకులు సతీష్, అరవింద్, కనకయ్య తదితరులు ఉన్నారు.

### కాలువ నిర్మాణం మాకొద్దు..



మాట్లాడుతున్న రైతులు

సిద్దిపేటరూరల్: తక్కువ విస్తీర్ణం కలిగి ఉన్న తమ భూముల నుంచి కాలువ నిర్మాణం చేపట్టొద్దని రాఘవాపూర్ రైతులు కెనాల్ సర్వే అధికారులను కోరారు. గ్రామంలో కాలువ నిర్మాణానికై భూసేకరణ అధికారులు మంగళవారం రైతుల భూముల్లో కొలతలు చేపట్టారు. తక్కువ విస్తీర్ణం కలిగిన తమ భూములు నష్టపోతామని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని అధికారులను వేడుకున్నారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మీపతి, రేణుక, భాగ్యమ్మ, నర్సవ్వ, మల్లేశం, దశరథం తదితరులు పాల్గొన్నారు.

### బదిలీలు సహజం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని హెచ్ఎం గోపీకళ అన్నారు. మండలంలోని తిగుల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నందిని, సంతోషి మాత బదిలీపై వెళ్లడంతో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారు 12 యేళ్లుగా విధులు నిర్వహించి పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆ ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తయ్య, సంధ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### తప్పులను సరిదిద్దుతున్న సీఎం



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరిదిద్దుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 11 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారన్నారు. పదేళ్ల పాటు కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ఆర్థిక వనరులపై దృష్టిసారించి సరిచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో శంకర్, మధు, గయాజొద్దీన్, అనిల్, సంతోష్ గౌడ్, సిద్దిరాములుగౌడ్ తదితరులున్నారు.

### విద్యార్థులకు యూనిఫారాల అందజేత



విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో ఉచితంగా యూనిఫారాలు అందజేశారు. గ్రామానికి చెందిన మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కర్ణాకర్, వెంకటస్వామి తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు మంగళవారం దుస్తులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, ఉద్యోగులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరొద్దీన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రాప్ సర్వే కష్టతరం

- సాంకేతిక సమస్యలతో సతమతం
- మహిళా ఏఈఓలకు అవస్థలు
- సహాయకులు కావాలంటూ వేడుకోలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ఏఈఓలు

**దేశవ్యాప్తంగా వ్యవసాయానికి సంబంధించి పక్కా ప్రణాళికలను రూపొందించడానికి కేంద్రం ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)ను ప్రారంభించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 127 మంది ఏఈఓలు పంట సర్వేలో పాల్గొంటున్నారు. అందులో సుమారుగా 65 మంది వరకు మహిళా ఏఈఓలు ఉంటారు. వారంతా పంట సర్వేకు వెళ్లే సమయంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న పొలాలకు వెళ్లి సర్వే చేయాలంటే జంకుతున్నారు.**

అక్కన్నపేట(హుస్నాబాద్): పంట సర్వేలో వ్యవసాయ విస్తరణాధికారులు చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారు. గుట్టలు, కొండలు, వాగులు, వంకలు దాటుకుంటూ పంటపొలాల దగ్గరకు వెళ్లవలసి వస్తోంది. తీరా అక్కడికి వెళ్లాక నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. కొన్ని సందర్భాలలో ఒక సర్వే నంబర్‌లో వేరే రైతు వివరాలు చూపించడం లాంటి సాంకేతిక సమస్యలు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదాల దారి..**

పంట వివరాలను నమోదుచేసి ఫొటో తీసిన తర్వాత సబ్‌మిట్ కావడానికి చాలా సమయం పడుతోందని, ఇలాంటి సమస్యలు తలెత్తడంతో వెళ్లిన పొలం వద్దకే మళ్లీమళ్లీ వెళ్లాల్సి వస్తోందని ఏఈఓలు వాపోతున్నారు. పొలాలకు వెళ్లేదారులు సరిగా లేక కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది. వెళ్లే దారుల్లో విద్యుత్ వైర్లు, పాములు లాంటి ప్రమాదాల బారినపడుతూ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకొని న్యాయం చేయాలని ఏఈఓలు కోరుతున్నారు.



రామవరంలో పంటసర్వే చేస్తున్న ఏఈఓ

### భయం.. భయంగా



ఈ డిజిటల్ పంట సర్వేతో మహిళా ఏఈఓలు అందరం సీత కష్టాలు పడుతున్నాం. సర్వేలో మహిళలకు భద్రత కరువైంది. పంటపొలాలకు ఒంటరిగా వెళ్లాలంటే భయం భయంగా వెళ్తున్నాం. పాములు తదితర విష పురుగులు దర్శనమిస్తున్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తిస్తున్నాం. మాకు సహాయకులను కేటాయించాలని కోరుతున్నాం.

**- కరంటోతు శ్రీలత, ఏఈఓ, రామవరం**

### అవస్థలు పడుతున్నాం.. న్యాయం చేయండి

**మంత్రి పొన్నంకు ఏఈఓల వినతి**

డిజిటల్ క్రాప్ సర్వేలో మహిళా ఏఈఓలకు ఇబ్బందికరంగా ఉందని, తగిన న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఉమ్మడి మండలాలకు చెందిన 39 మంది వ్యవసాయ విస్తరణాధికారులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా తాము పంట సర్వే చేపడతున్న క్రమంలో అనేక అవస్థలు పడుతున్నామన్నారు. ఏఈఓల్లో 65 శాతం మహిళలే ఉన్నారని, అందులో కొందరు గర్భిణులు, అంగవైకల్యంతో ఇబ్బందులు పడేవారు ఉన్నారని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మంది చేయాల్సిన సర్వేను కేవలం 2,600 మంది ఏఈఓలతో చేయించడం దారుణం అని, ప్రతి గ్రామానికి ఒక సహాయకుడిని నియమించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు ఏఈఓలు తెలిపారు.

## అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వినాయక సేవా సమితి సభ్యులు

గజ్వేల్‌రూరల్: అందరూ ఒకచోట చేరి ఆత్మీయానురాగాలను పంచుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని అయ్యప్పనగర్ కాలనీకి చెందిన వినాయక సేవా సమితి సభ్యులు అన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడలోగల ఓ రిసార్ట్‌లో మంగళవారం వారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితిలోని కుటుంబ సభ్యులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కమి టీ ప్రతినిధులు కాశీప్రసాద్, రాజేశం, వెంకటనర్సింహారెడ్డి, వీరారెడ్డి, బండ్ల స్వామి, నారాయణ రెడ్డి, రామచంద్రం, అంజిరెడ్డి, మల్లేశం గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రం

**ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి**



శ్రీశైలం దంపతులను సన్మానిస్తున్న రఘోత్తంరెడ్డి

మద్దూర్(హుస్నాబాద్): సమాజంలోని అన్ని వృత్తులకంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో మంగళవారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కామిడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భూర్గు శ్రీశైలం ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాతలైన ఉపాధ్యాయ వృత్తికి ఉపాధ్యాయలు వన్నెను తీసుకురావాలని, ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు ఉత్తమ గుర్తింపు లభిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఒక్కరికి సహజం అని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధానకార్యదర్శి శశిధరశర్మ, రిటైర్డు ఎంఈఓ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే మద్దతు ధర

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి సూచించారు. మండలంలోని జగదేవ్‌పూర్, ఇటిక్యాల, పీర్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఓ వసంత రావు, మాజీ ప్రజాప్రతినిధులు యాదవరెడ్డి, చంద్రశేఖర్, కిరణ్, నరేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓలు పాల్గొన్నారు.

### టిప్పర్‌కు మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి టిప్పర్ తగలబడింది. ఈ ఘటన మంగళవారం రాత్రి వర్గల్ మండలం శేరిపల్లి వద్ద చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటిపల్లి నుంచి శేరిపల్లి మీదుగా వర్గల్ రోడ్డు వరకు తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించిన టిప్పర్లు, జేసీబీ తదితర వాహనాలను ప్రతిరోజు పనిముగిసిన తరువాత శేరిపల్లి పోచమ్మ టెంపుల్ ప్రాంతంలో నిలిపేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఓ టిప్పర్ ముందు భాగంలో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉంటాయని అనుమానిస్తున్నారు.

### చదువుతోనే గుర్తింపు

దుబ్బాక టౌన్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని హెచ్ఎం అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థి మంద లక్ష్మణ్ సహకారంతో 65మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, టై, బెల్టులు, అంగన్వాడీ కేంద్రాలకు ఫర్నిచర్, ఫ్యాన్, ట్యూబ్‌లైట్ అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, హరిహర ప్రసాద్, శ్రీనివాస్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### స్వతంత్ర సమరయోధుడి భార్య మృతి



యాదమ్మ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని గొల్లపల్లికి చెందిన స్వతంత్ర సమరయోధుడు వంటేరు విఠల్‌రెడ్డి భార్య యాదమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె మృతికి మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేషంగౌడ్, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, మమత అంజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు వెంకట్రామిరెడ్డి, నరేందర్‌రెడ్డి, శంకర్ తదితరులు సంతాపం తెలిపారు.

### స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్

హుస్నాబాద్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ శోభాదేవి ఎంసెట్ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. యూనిట్ పరీక్షల్లో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు బ్యాడ్జిలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు సరైన ప్రణాళికతో చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అధ్యాపకులు రవీందర్, లక్ష్మయ్య, సదానందం, కర్ణాకర్, సంపత్, నిర్మలాదేవి, కవిత పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించండి



ఏడీ జగదీష్‌ను కలిసిన గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అక్కారం, శ్రీగిరిపల్లి గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించారు. విద్యుత్ ఏడీ జగదీష్‌ను అక్కారం మాజీ సర్పంచ్ బాల్‌చంద్రం, శ్రీగిరిపల్లి సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి కలిసి తమ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలతో పాటు అక్కారం, శ్రీగిరిపల్లి తదితర గ్రామాలకు ఒకే ఫీడర్‌పై విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సమస్యను సరిచేసే క్రమంలో సిబ్బంది సైతం ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏడీ హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజు, కన్నాయాదవ్, బాలస్వామి, చంద్రం, స్వామి, అశోక్, కుమార్, సురేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలంటూ ధర్నా

సిద్దిపేటకమాన్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు వేరువేరుగా అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు సంతోష్, జస్వంత్, రాకేశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రంజిత్, స్వప్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో వైద్యసేవలు అధ్వానం

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు అధ్వానంగా ఉన్నాయని, నిరంతరం సేవలందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓపీలో వైద్యసేవలు అధ్వానంగా ఉన్నాయన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బంది, రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఆశా వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ఇటీవల మృతి చెందిన మాజీ వార్డు సభ్యుడు బుడిగె విజయ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, చంటి, సతీశ్, శ్రీధర్, బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని గుర్తించడంలో అప్రమత్తం

**సీనియర్ శాస్త్రవేత్త డా.శ్రీదేవి**



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీదేవి

సిద్దిపేటరూరల్: రైతులు, విద్యార్థులు తమ రోజువారీ జీవితంలో ఎదురయ్యే అవినీతిని గుర్తించడంలో అప్రమత్తంగా ఉండాలని పరిశోధనా కేంద్రం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డా.శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని తొర్నాల గ్రామంలోని పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతులు, విద్యార్థులతో విజిలెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువుల ఎంపికలో జరిగే అవినీతిని ముందస్తుగానే గుర్తించాలన్నారు. ప్రతీ ఒక్కరూ అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, పంచాయతీ కార్యదర్శి జీవన్‌రెడ్డి, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపంటకు నీటితడి తప్పనిసరి

**అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్**



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: నేలలో మొక్కకు సరిపడా తేమ లేకపోవడం, వర్షాల అనంతరం నీటి తడిని అందించడంలో ఆలస్యం జరిగితే పూత, కాయ రాలిపోతాయని, క్రమం తప్పకుండా నీటితడిని అందించాలని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని మిట్టపల్లిలో మంగళవారం పూత, కాయ రాలుతున్న పత్తి పంటను పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. వర్షాల అనంతరం చేనుకు నీటిని అందించే ముందు 13-0-45 వంటి నీటిలో కరిగే పోషకాలను ఎకరాకు ఒక కిలో చొప్పున పిచికారీ చేసుకుంటే సమస్యను అధిగమించవచ్చని సూచించారు. పత్తిని ఒక దఫా తీసిన తర్వాత గులాబీరంగు పురుగు ఉధృతి అధికమవుతుందని, ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకొని అవసరం అయితే పురుగు మందులను పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పత్తిలో పిండినల్లి లక్షణాలు కనిపిస్తున్నాయని దీని నివారణకు అసిఫేట్ లేదా ఇమిడాక్లొప్రిడ్ వంటి మందులు వాడాలని సూచించారు. ఏఓతో పాటు ఏఈఓ పవన్ ఉన్నారు.

## మట్టి ప్రమిదలే మంగళకరం

**మున్సిపల్ చైర్ పర్సన్ రజిత**



మట్టి దివ్వెలను చూపుతున్న రజిత, కౌన్సిలర్లు

హుస్నాబాద్: దీపావళి పర్వదినాన దీపాలు వెలిగించేందుకు ప్రజలంతా మట్టి ప్రమిదలనే వాడాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వచ్ఛ దీపావళి శుభ దీపావళి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచాను తక్కువగా ఉపయోగించి కాలుష్యాన్ని తగ్గించాలని కోరారు. పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, స్వర్ణలత, భాగ్యరెడ్డి, పద్మ, సరోజన, రత్నమాల, సుప్రజ, కో–ఆప్షన్ సభ్యుడు శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఏఈఓల నిరసన



నిరసన తెలుపుతున్న ఏఈఓలు

దౌల్తాబాద్(దుబ్బాక): డిజిటల్ పంట సర్వేను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని కోరుతూ ఏఈఓలు నిరసనకు దిగారు. రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం వారంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగతా 11 రాష్ట్రాలలో లాగానే మన రాష్ట్రంలోకూడా సర్వేను ప్రైవేట్ ఏజేన్సీకి అప్పగించాలన్నారు. ఇటీవల సస్పెండ్ చేసిన 165 మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈఓలు సంతోష్ కుమార్, శిరీష, సునంద పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా కార్మిక నాయకుడు దరిపల్లి చంద్రం



తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. కరోనా సమయంలో కార్మికులకు అండగా నిలిచి, వేరే రాష్ట్రాల కార్మికులకు ఉచితంగా ఆహారం అందిస్తూ, వారి రాష్ట్రాలకు చేరుకునే విధంగా రవాణా సౌకర్యం కల్పించారు. అదేవిధంగా పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ విద్యాప్రదాతగా నిలుస్తున్నారు. కార్మికుల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బిఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా గత అనేక సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వహిస్తూ, కార్మికుల పక్షాన కార్మికులకు, ప్రభుత్వాలకు మధ్యవారధిగా నిలుస్తున్నారు. కార్మికుల కుటుంబాలు ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబీకులకు బియ్యంతో పాటుగా రూ.5000 ఆర్థిక సాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. దాదాపు 1500 మంది పేద విద్యార్థులకు విద్య అందించే విధంగా కృషి చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులు, విద్యుత్ కార్మికులు సమస్యల పరిష్కారానికి వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నారు.